క్లుప్తంగా

18న ఉచిత వైద్య శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: మాజీ సైనికుల సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పెద్దరెల్లి వీధి వద్ద ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ భవనంలో ఈ నెల 18న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేయనున్న ఈ శిబిరంలో స్పెషలిస్టులు, గైనకాలజిస్టు, కార్డియాలజిస్టులు హాజరవుతారని, షుగర్, బీపీ, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సహజ ఎరువులతో భూమి సారవంతం



సహజ సిద్ధమైన ఎరువులను తయారు చేస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల: ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలు, ద్రావాలతో తయారుచేసిన ఎరువులు, క్రిమిసంహారక కషాయాలను వినియోగిరచి వ్యవసాయం చేస్తే భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం ఎస్‌డీపీ సూర్యనారాయణ అన్నారు. గురువారం కేశవరావుపేటలో రైతులకు ప్రకృతి ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు బదులు మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని వినియోగించాలన్నారు. ద్రవ జీవామృతంతో పంటలపై చీడ, పీడలను నివారించవచ్చని చెప్పారు.

వర్సిటీ పదవులకు కావ్యజ్యోత్స్న రాజీనామా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోషల్ వర్క్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న తాను నిర్వహిస్తున్న పదవులకు రాజీనామా చేశారు. ఈమె ఓఎస్‌డీగా, సీడీసీ డీన్‌గా, సోషల్ వర్క్ హెచ్‌ఓడీగా వ్యవహరిస్తున్నారు. హెచ్‌ఓడీగా తప్ప మిగతా పదవులకు రాజీనామా చేయగా అధికారులు ఆమోదించారు. రాజీనామా అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో ఒకరు, సోషల్ వర్క్‌లో ఇద్దరు, బయోటెక్నాలజీలో నలుగురు కలిపి ఏడుగురు మాత్రమే రెగ్యులర్ బోధకులు ఉన్నారు.

కార్మికుల సమ్మెకు కౌలు రైతుల మద్దతు



సమ్మె కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కౌలు రైతు సంఘం అధ్యక్షుడు రమణ

రణస్థలం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న జరిగే తలపెట్టిన కార్మిక సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్లు ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ ప్రకటించారు. సమ్మెకు మద్దతుగా మండల కేంద్రాల్లో జరిగే నిరసన ప్రదర్శనలలో కౌలు రైతులు, రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం రణస్థలంలో కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసం కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, తోటపల్లి కాలువ మరమ్మతులు చేపట్టాలని, నారాయణపురం ఆనకట్ట ఆధునీకరణ చేసి కుడి, ఎడమ కాలువల ద్వారా చివరి భూముల వరకు నీరు ఇవ్వాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమెరికాతో ఫ్రీ ట్రేడ్‌కు సిద్ధమౌతుందని, దీనివల్ల భారత్‌కు తీవ్ర నష్టమని ఆందోళన వ్యక్తం చేశారు.

అనాథలకు వస్త్రాల వితరణ



వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): నగరంలోని ద్వారకానగర్ కాలనీలో ఉన్న ఖ్యాతి ఫౌండేషన్ ఆవరణలో గురువారం ఎస్.ఆర్.గంజి, ఎస్.సంజీవయ్యల వర్ధంతి సందర్భంగా దామోదర సంజీవయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథలకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 గవర్నర్ కొంక్యాన మురళీధర్, డాక్టర్ గంజి ఆర్.ఎజ్రా, జర్నలిస్టుల ఐక్య వేదిక కన్వీనర్ శాసపు జోగినాయుడు, రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల నేత పోతల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..!



వంశధార నగర్ కాలనీలో దుస్థితి..



డీసీసీబీ కాలనీలో రోడ్లపై పారుతున్న మురుగునీరు



తిలక్‌నగర్‌లో పగిలిన డ్రైనేజీ పలకలు

- అధ్వానంగా శివారు కాలనీలు
- వీధి రోడ్లపైనే మురుగునీటి ప్రవాహం
- డ్రైనేజీలపై విరిగిన పలకలు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నగరపరిధిలో విలీనమైన పలు కాలనీలు కంపుకొడుతున్నాయి. డీసీసీబీ కాలనీ, వంశధార నగర్ కాలనీ, బావాజీనగర్, తిలక్‌నగర్, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లో కాలువలు నిండిపోయి రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు దుర్వాసన భరించలేకపోతున్నారు.

కాలువల్లో ఎక్కడికక్కడే పూడికలు పేరుకుపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. దీనికితోడు రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయి దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పందులు స్వైర విహారం చేస్తూ పరిసరాలను అధ్వానంగా మారుస్తున్నాయి. ఎక్కడికక్కడ గతుకుల రోడ్లు, విరిగిన పలకలతో కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం తగదని స్థానికులు మండిపడుతున్నారు.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం

కాలనీల్లో సమస్యలను స్పెషల్‌డ్రైవ్ ద్వారా పరిష్కరిస్తాం. ప్రస్తుతం నగరంలోని పూడికలు పనులు త్వరితగతిన చేస్తున్నాం. ఇవి పూర్తయిన వెంటనే రూరల్ పరిసర ప్రాంత కాలనీల్లో సమస్యలపై దృష్టిపెడతాం.

– ప్రసాదరావు, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్

పన్నులు చెల్లిస్తున్నాం..



కాలనీలో సమస్యలు పేరుకుపోయాయి. రాత్రిపూట పాముల భయం వెంటాడుతోంది. అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదు. పన్నులు మాత్రం ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు. సచివాలయంలో ఫిర్యాదు చేసినా చూస్తాం.. చేస్తామంటూ మాట దాటవేస్తున్నారు.

– కొండాల గణేష్, తిలక్‌నగర్

అప్పుడే బాగుండేది..



డీసీసీబీ కాలనీ, వంశధారనగర్ కాలనీ, తిలక్‌నగర్, ద్వారకానగర్‌లన్నీ సమస్యలు సుడిగుండంలో ఉన్నాయి. పంచాయితీలో ఉండేటప్పుడు ఎటువంటి సమస్య ఉన్నా సాయంత్రానికి పరిష్కరమయ్యేది. నేడు ఎవరూ పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు కూడా సరిగ్గా రావడం లేదు.

– సంతోష్‌కుమార్, వంశధార నగర్ కాలనీ

కూటమి పాలనలో ఉపాధి పథకం నిర్వీర్యం



బాతువలో వేతనదారులకు గొడుగులను పంపిణీ చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, కలిశెట్టి శాంతారావు

- విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన
- బాతువలో వేతనదారులకు గొడుగుల పంపిణీ

జి.సిగడాం: ఉపాధి హామీ పథకాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, వేతనదారులకు సకాలంలో బిల్లులు చెల్లించక ఇబ్బందులకు గురిచేస్తోందని విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. గురువారం జి.సిగడాం మండలం బాతువ గ్రామంలో ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో ఎండ నుంచి వేతనదారులకు రక్షణ కల్పించేందుకు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కలిశెట్టి శాంతారావు సొంత నిధులతో 125 భారీ గొడుగులు కొనుగోలు చేశారు. వీటిని గురువారం ఎంపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని చేసిన ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు నమోదు చేయడం తగదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజల కోసం పాటుపడుతున్న కలిశెట్టి శాంతారావు సేవలు అభినందనీయమన్నారు. ప్రతి కార్యకర్త ప్రజల కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో చందక సూర్యారావు, కలిశెట్టి మణికంఠ, వెంకటేష్, నారాయణరావు, రమణ, అప్పలనాయుడు, తేజ, పవన్, సన్యాసినాయుడు, చంద్రమోహన్, జగదీష్, సూర్యకుమార్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన



యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న పోలీసు సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: శక్తి యాప్‌పై ప్రతి విద్యార్థిని అవగాహన కలిగి ఉండాలని శక్తి యాప్ టీం ఎస్‌ఐ రాజేష్ అన్నారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ వివేకానందరెడ్డి సూచన మేరకు గురువారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన శక్తి యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తిస్తే శక్తి యాప్ ద్వారా సమాచారంఇవ్వాలని, 10 నిమిషాలకే ఘటనా స్థలానికి చేరుకుని అల్లరిమూకల భరతం పడతామని చెప్పారు. కార్యక్రమంలో శక్తి టీం హెచ్‌సీ సోమేశ్వరమ్మ, పీసీలు రాజు, రోజా, సత్య, మోహనరావు, పాల్గొన్నారు.

ఇంగ్లిష్ గ్రామర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజశేఖర్ విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్(ఆంగ్ల వ్యాకరణం)పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, సిబ్బంది రామ్మోహన్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పలాస ఎమ్మెల్యే

శ్రీకాకుళం పాతబస్టాండ్: పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష గురువారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఉద్దానం ప్రాంతానికి తాగునీరు సమస్య పరిష్కరించేందుకు కృషి చేసినందుకు గాను ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

సేవే పరమావధిగా..



గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా ప్రాణరక్షా పురస్కారంఅందుకుంటున్న ఉమాశంకర్(ఫైల్)

- కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తున్న ఉమాశంకర్
- మిత్రులతో కలిసి ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ఏర్పాటు
- కోవిడ్ సేవలకు గాను గవర్నర్ పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్: సేవే పరమావధిగా భావిస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు నగరానికి చెందిన నంది ఉమాశంకర్. రెడ్‌క్రాస్ సంస్థలో చేరి చైర్మన్ జగన్మోహనరావు స్ఫూర్తితో దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తం అందించడంతో పాటు ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ద్వారా అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు.

ప్రాణరక్షా పురస్కారం..

ఉమాశంకర్ రెడ్‌క్రాస్‌లో ఉంటూ వేలాది సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో మృతదేహాలకు దహన సంస్కారాలు చేయడానికి చాలామంది భయపడి వెనుకంజ వేసినా ధైర్యంగా ముందుకు వచ్చి అంత్యక్రియల్లో పాల్గొనేవారు. లాక్‌డౌన్ సమయంలో అభాగ్యులకు అన్నం అందించడం, కరోనా వైరస్ సోకిన వ్యక్తులకు సేవలు చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఈ సేవలను గుర్తించి అప్పటి గవర్నర్ నరసింహన్ ప్రాణరక్షా పురస్కారం ప్రదానం చేశారు.

17వేల మంది సభ్యులతో గ్రూప్..

ఓవైపు రెడ్‌క్రాస్‌లో సేవలు అందిస్తూనే మరోవైపు తన మిత్రులైన సామాజిక సంఘ సేవకులు ఉర్లం శివతేజ పట్నాయిక్, బొట్టా సాయికుమార్‌లతో కలసి 'ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్' పేరిట వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశారు. ఇందులో సుమారు 17వేల మందిని సభ్యులుగా చేర్చుకున్నారు. ఎవరికి సమస్య వచ్చినా ఈ గ్రూప్ ద్వారా తమవంతు సహకారం అందిస్తున్నారు.

అభాగ్యులకు భరోసా..

అవసరమైన వారికి రక్తం అందించడమే కాకుండా దాతల సహకారంతో ఇప్పటి వరకు 60 మందికి రెండు చక్రాల కుర్చీలు, ఐదుగురికి మూడు చక్రాల కుర్చీలు, ఇద్దరికి బ్యాటరీ చక్రాల కుర్చీలు, 70 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, ఇద్దరికి హ్యాండ్ స్టిక్స్, మరో ఇద్దరికి చెవిటి పరికరాలు అందజేశారు. 30 చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. యాచకులకు, కుష్టు వ్యాధిగ్రస్తులకు అన్న వితరణ, క్యాన్సర్ బాధిత కుటుంబాలకు మందులు, నగదు సాయం అందిస్తున్నారు.

మానవసేవే మాధవసేవ..

నా గురువు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు ప్రోత్సాహంతోనే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. మిత్రులతో కలిసి వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని దాతల సహకారంతో అవసరమైన వారికి అన్నీ అందిస్తున్నాను. మానవసేవే పరమావధిగా జీవితం కొనసాగిస్తాను.

– నంది ఉమాశంకర్, రెడ్‌క్రాస్, శ్రీకాకుళం



ఆపదలో ఉన్న వ్యక్తిని మోసుకెళ్తూ..(ఫైల్)



కోవిడ్ సమయంలో మృతదేహానికి అంత్యక్రియల కోసం సన్నాహాలు చేస్తూ.. (ఫైల్)



మిత్రులతో కలిసి దివ్యాంగునికి మూడుచక్రాల వాహనం అందిస్తున్న ఉమాశంకర్

అసంపూర్తిగా రోడ్డు పనులు



సంతవురిటి నుంచి విజయరాంపురం, సంతవురిటి కోనేరు నుంచి సీతారాంపురం వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

– జి.సిగడాం

ఇసుకతో ఇక్కట్లు



పరిమితికి మించి ఇసుక లోడ్లతో నిత్యం వందలాది లారీలు విశాఖపట్నం రాకపోకలు సాగిస్తున్నాయి. అధిక లోడింగ్ వల్ల దారి పొడవునా ఇసుకరాసులు పేరుకుపోతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనచోదకులు జారిపడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి అధికంగా ఇసుక లోడ్ చేయకుండా నివారించాలని పలువురు కోరుతున్నారు.

– రణస్థలం

షిరిడీసాయికి అభిషేకాలు



బలగలో షిరిడీసాయి బాబా మందిరం 23వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అర్చకులు జాత సత్యనారాయణ, సతీష్ శర్మల ఆధ్వర్యంలో భక్తుల చేతుల మీదుగా అభిషేకాలు, అర్చకులు నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణం అనంతరం మెహర్ నృత్య కళానికేతన్, బరాటం రామలక్ష్మీ శిష్యబృందంచే నృత్య కళా ప్రదర్శనలు జరిగాయి.

– శ్రీకాకుళం కల్చరల్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ టెక్నికల్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, అధ్యక్ష కార్యదర్శులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్ డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, నగర జనాభాకు అనుగుణంగా ఇంజినీరింగ్ కార్మికుల సంఖ్య పెంచాలని, ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీర్ వర్కర్స్ నిరవధిక సమ్మె బాట పట్టారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఉదయం నుంచి విధులు బహిష్కరించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ కార్యాలయ సిబ్బంది, వాల్ ఆపరేటర్స్, పంపు ఆపరేటర్లు విధులకు దూరంగా ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజు, సహాధ్యక్షులు జె.గురుమూర్తి, యూనియన్ నాయకులు సుగాలి శంకరరావు, మజ్జి శ్రీను, రామారావు, కిషోర్, త్రినాథ, రాఘవ, చంటి, మణి, దేవి, మాధురి, జయశ్రీ, రాజేశ్వరి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పొదుపు అలవరుచుకోవాలి



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ లక్ష్మి

ఎచ్చెర్ల: ప్రతి విద్యార్థి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని రిసోర్స్ పర్సన్, పోస్టుమాస్టర్ లక్ష్మీ తెలిపారు. లావేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం పోస్టాఫీసు సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతోనే వికాసం



శ్రీకాకుళం అర్బన్: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బలగ హడ్కో కాలనీ శాఖా గ్రంథాలయంలో గురువారం పిల్లలకు నీతి కథలు, సామెతలు చెప్పారు. అనంతరం ఖోఖో ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులతో ఖోఖో ఆడిస్తున్న దృశ్యం

ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు నేడు

రణస్థలం: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి శుక్రవారం ఉదయం 9 గంటలకు రణస్థలం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు సంబంధిత ధ్రువపత్రాలతో వ్యక్తిగతంగా హాజరుకావాలని కోరారు.